రావు (2) అసలు కొడుకు రాధను పెళ్ళిచేసుకుంటానంటాడు. శ్రీనివాసం ఒప్పుకుంటాడు. ఇదీ కథ. ఇందులో అర్థంలేని హాస్యోక్తులు, నినాదాలు అడుగడుక్కీ వినిపిస్తాయి.

'సర్వయ్య' 'రాధ' పనిమనుషుల్లాగ కొంతసేపు, ప్రచారకులలాగ కొంతసేపు మాటలాడ్తారు. కారణం చూపించకుండా ఇందులో పోలీసు ఇనస్పెక్టరు ఎవరు కనిపిస్తే వాళ్ళని అరెస్టు చేస్తాడు. పోలీసుల్ని ఒక పాత్రచేత తిట్టించారుకూడా! చైతన్యం వెధవ పోలీసులు! అనవసరమైన వాళ్ళని పట్టుకు వదలరు. ఇది ప్రదర్శనలో ఎలాగ చెప్పనిచ్చారో! సర్వయ్యచేసిన అపచారాలకి సిగ్గుపడక వాటిని గురించి గొప్పలు చెబుతాడు.

"సిగ్గు, సిగ్గు ప్రపంచాన్నిచూసి భయపడే వాళ్ళకి మనకెందుకే సిగ్గు ఎగ్గూ! మనం ప్రపంచంలో సావలేక బ్రతుకుతాం. బ్రతికి కష్టపడలేక ఎల్లాగో అల్లా సుఖపడతాం. సుఖపట్టానికి ఎల్లా వీలైతే అల్లా చేస్తాం. సిగ్గు మనకికాదు. ప్రపంచంలో నీతినియమాలతో పేరు ప్రతిష్టలూ తెచ్చుకొని గొప్పోళ్ళం కావాలనుకొనే వారికి. మనకెందుకే సిగ్గు. రోజంతా రోజుగా గడపేసి నిద్రపోవటమే మనకు కావల్సింది" అంటాడు ఎంతగొప్ప వేదాంతం!!

ఎనిమిది ఏళ్ళనించీ కొడుకుగా కూతురుగా చూచుకొన్న పనిపిల్ల రాధని అకస్మాత్తుగా బయటపడిన కొడుకు అనే వేషధారిచేత చెఱుపబడిన తర్వాత అసలు కొడుకు అనుకొన్న వాడితో పెళ్ళికి ఎలాగ శ్రీనివాసం అనే పెద్దమనిషి ఒప్పుకొంటాడో ఆశ్చర్యమే.

ఇలాంటి అవకతవకలతో, అల్పభావాలతో కూడిన యీ నాటికల్ని మెచ్చినవారు అనర్హ ప్రశంసలకు పాలుజేసి ఆంధ్ర రంగస్థలానికే తీరని ద్రోహంచేసి మన అభిరుచుల్ని అధమస్థాయిలోకి దించుతున్నారని చెప్పక తప్పదు.

కథానిక

# జీవనయానం

ఇసుకపల్లి దక్షిణామూర్తి

ఆనాటి పయనం ఎట్లా వుంటుందో అని బిక్కుబిక్కుమంటూ ఎర్రమొగంతో అప్పుడే తొంగి చూస్తున్నాడు సూర్యభగవానుడు. ఆరు బయట పడవేసిన మాచంమీదనుంచి ఆవలిస్తూ లేస్తూ ఆ రోజు చేయవలసిన పనులన్నీ నెమరువేసుకుని దినం ఎలా గడుస్తుందా అనుకుంటూ ఆలోచనాభారంతో రాత్రంతా అలసిపోయిన ముఖాన్ని కడుక్కోవటానికి పోయాను. నాలో కలిగిన ఉద్రేకం, ముఖంమీద వేలాడుతున్న అలసట బాపతు ఆలోచనలన్నీ కడుక్కునిపోవటంతోనే బయటపడింది. నాలోని విలక్షణాలను దుస్తులతో కప్పుకుని విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టాను నాలో మిగిలివున్న వుద్రేకాన్ని బయలుపెట్టుకుందామని. తన తేజస్సును కప్పిపుచ్చుతున్న మంచుపొరలను గాలిలో కలిపేసి, విలయతాండవానికి వుద్యుక్తుడవుతున్నాడు మార్తాండుడు.

ముద్రితమైన లోహపుముక్కల వ్యయం గతించిన దినమే గతించటంచేత వీధి కుళాయినీటిని నా కడుపునిండా నింపుకుని నా ఆశలన్నీ దానిలో నిబిడీకృతం చేసుకున్నాను. వ్యయపు వివరం అవసరంలేని వాయువును హృదయ కుహారాల నిండా నింపుకుని బ్రేవుమని నిట్టూర్చాను. పైకి పాకుతున్న అరుణ కిరణాలు చీకటి తెరలను తరిమివేస్తున్నాయి. ప్రపంచంలోని చీకటంతా పటాపంచలయిపోయినా నా పక్కనే వున్న ఛాయ మాత్రం నిలకడగా నన్నంటిపెట్టుకునే వున్నది. నాతోనే వస్తానంటున్నది నా అనుమతితో నిమిత్తం లేకుండానే నా వ్యూహాపథంలో నృత్యం

చేస్తున్న సంశయ బాలలను నాలోని చైతన్యంతో పారద్రోలుతున్నా నా అస్థిత్వాన్ని అంటిబెట్టుకుని అపజయం అనే సంశయం హృదయ పీఠికపైన ఛాయామాత్రంగా నిలబడేవుంది.

వీధిలో అడుగుపెట్టగానే ప్రథమంగా కనపడింది ఒక వాహనం. అది నడవటానికి తైలం కావాలి. నేను నడిచటానికి నేనే వున్నాను. ఆ వాహనాన్ని సమీపించి దాన్ని నడిపే జీవచ్ఛవాన్ని వెళ్ళి అడిగాను "నా గమ్యస్థానానికి చేరుస్తావా" అని. అగమ్యగోచరంగా నా వంక చూచి "నీకూ వక గమ్యస్థానం వుందా" అన్నాడు. నాకు తెలుసు గమ్యస్థానం అనే పదం మా ఇద్దరి జీవిత నిఘంటువులలోనుంచి తొలగింపబడి చాలా కాలం అయి యీనాటికి మరి కొద్దికాలం కూడా అవస్తున్నదని. గాలిలోకి బాణాలు వదిలిపెట్టటం వలన నా వింటిత్రాణ నష్టపడుతుందన్న విషయం ఈనాడు గుర్తించింది కాదు. అతనివంక తీవ్రంగా చూచి అనుకున్నాను!" నన్నూ ఈ తైల యంత్రాలను తోలేపనిలో ప్రవేశపెట్టివుండినట్లయితే నా బ్రతుకును జీవచ్ఛంలాగానైనా నడిపించుకు పోయేవాడిని గదా!" అని. నామీద శిథిలమైన ఆలోచనల తాలూకు ధూళిని దులుపుకుంటూ జీవచ్ఛవం వెళ్ళిపోయింది యిందాకటి వాహనంమీద. ఆ ధూళి హృదయ కుహరాలలోకి పోయి సంశయపు నీడలను వ్యాకోచం చెందిస్తున్నదన్న సందేహంచేత నాసిక రంధ్రాలమీద ఆచ్ఛాదం వుంచుకుని శిరము పైకెత్తి నా స్నేహితునివంక చూచాను. సహస్ర కిరణుడు అన్ని కిరణాలను నామీదనే కేంద్రీకరించి వుగ్రరూపంలో దర్శనమిచ్చాడు. నా బాధకి సానుభూతి చూపలేని కృతఘ్ను మిత్రునివంక చూడటానికి మనసొప్పక తలవాల్చాను. పొడుగాటి నా నీడ నా సంశయాల పరిమాణాన్ని ఎత్తి చూపుతూ నా దగ్గిరే వుంది—

సూర్యునికీ నాకూ మధ్యనున్న అంతరాన్ని సూచనప్రాయంగా ప్రస్ఫుటంచేస్తూ లోహవిహంగం వకటి నా శిరంపైకుండా గాలిని కోసుకుంటూ పోతున్నది. దానిలోగూడా నాబోటి ద్విపాద పశువులు వుండివుంటాయి. లోహవిహంగాలను ఎగురవేసే విద్య నాకు నేర్పించివున్నట్లయితే నేను గాలిలో తేలిపోయేవాడినిగదూ! ఇప్పుడు గాలిలోనే వున్న ఆలోచనలు అంతకు మించి పైకి పోలేక అక్కడే స్థంభించిపోతాయి. నా జీవనరాగంలో శ్రుతులన్నీ పలకవు ఆనాడు. తీగలు లేని నా హృదయవీణ గాలిచప్పుడుకు శ్రుతికలిపి రోదనం చేస్తుంది కాబోలు—విద్యా నిలయాల్లో పట్టభద్రులను పటకాలతో తయారుచేసి నిజ పదభ్రష్టులను గావించకపోతే వున్న నిజాన్ని నిలవనివ్వగూడదూ! అజ్ఞానపు పొరలను తొలగించే పేరుతో అంతకంటె మందమైన విజ్ఞానపు పొరలు తగిలించి అంధకార బంధురం చెయ్యటం ఎందుకు? నా సంశయాలు పెట్టే బాధ, గాలిలో యినుప గద్దలమీద విహారం చేసేవారి సుఖానికి పోల్చుకుని క్రుంగిపోతోంది. నా బాధని ఇమడింపవలసిందిగా నా హృదయం ఎవరిని పిలిచి అడిగింది? నా పొడుగాటి నీడ నా సంశయపు లోతులనుగుర్తుచేస్తూ భయపెట్టుతూనే వుంది.

'ఉద్యోగం పురుషలక్షణం'అన్న సూక్తిని మనః ఫలకంలోనుంచి వెలుపలికి లాగి పురుషపదం తొలగించి 'సమర్థ లక్షణం'అని మార్చుకున్నాను నా అసమర్థతను బహిరంగం చేసుకుందామని. చేతకానితనం చేతులెత్తి లాస్యవిన్యాసం చేస్తూంటే సంశయాలన్నీ హృదయపీఠకంనుంచి దిగివచ్చి విన్యాసానికి కళాదృష్ట్యా సాయపడుతున్నాయి. ఖాళీ చెయ్యబడ్డ నా తెలివితేటల కొంప అలాగే శూన్యంగా వుండిపోయింది. దానిలో ఆలోచనా శక్తులను ప్రవేశపెట్టాలనే తెలివితేటలు కూడా తట్టకపోవటంవలన 'ఉద్యోగాలు ఖాళీలేవు'అంటూ వాకిటనిలబడి ఘోషిస్తున్న కొయ్యపలకను అపార్థం చేసుకున్న నేను లోపలకు పోయి 'మీరు ఏం కోరియిటు విచ్చేసారు'అంటూ అటువచ్చిన యజమాని ప్రశ్నను పదేపదే స్మరించుకుని ప్రశ్న నర్థంచేసుకోగల స్తోమతు లేక, దానికి సమాధానమీయగల ఆలోచనా వ్యక్తులు తెలివితేటల కొంపను ఖాళీ చేసిన సమయం గలించటం వలన ఆలోచనా రహితంగా వాకిట అడుగుపెట్టాను. నా కిప్పుడూ ఏ సంశయమూ లేదు—ఎటువంటి ప్రశ్న నాలో వుదయించటం లేదుగాబట్టి. నా సహాధ్యాయునికోసం నాలుగువైపులా వెతుక్కున్నాను. సూర్య తాపానికి తాళలేక నా కాళ్ళకింద అలసట తీర్చుకుంటోంది నా పిరికి నీడ.

గతించిన దినమంతా గతంకాబోయే భాగాన్ని వెక్కిరిస్తూ వెనక్కుపోతోంది. వెనక్కు నడిచినా ముందుకు నడిచినా లేని గమ్యస్థానం నాకు వకే దూరంలో వుంటుంది. తెలిసిన బాటకాబట్టి అడుగు వెనక్కు ప్రారంభించాను. నా దృక్పథంలోకి వస్తున్న ప్రతివస్తువులోనూ నాబోటిజీవం కనబడుతూనే వుంది. నాలోని ఆలోచనలకు పదును పెట్టి ఆ ప్రత్యేకపు పనిలో ప్రవేశపెట్టినట్లయితే నేను చెయ్యలేని పని ఒక్కటీ లేదు. నేను నేర్చుకుని అనుభవంలోకి తీసుకురాలేని విచిత్రపరికరం ఎక్కడా కనిపించడంలేదు. తెరమీద బొమ్మలనుచూపించగలను. బొమ్మలుచూపించే పరికరాన్ని నాచేతులతో సునిశితంగా సృష్టించగలను.మహోదధులను దాటివేయగల పెద్దపడవలను నిర్మించగలను. నాయిల్లు కట్టుకోగల స్తోమత నాలోవున్నది. అన్నీవున్నాయి. అవకాశంలేదు. ఆధారంలేదు. నా వూహాసౌధాలను నిర్మించుకోటానికి నా ఆశయపు యిటుకలున్నాయి. వాటిని చేర్పించటానికి కావలసిన సున్నం కావలసి వస్తూనేవున్నది. ఆశయంలేని ఆలోచనలు సున్నం లేని యిటుకల్లాపడి విరిగిపోతున్నాయి. ఆలోచనలు పెరుగుతున్నాయి. నా కాలికింది నీడ నిర్భయంగా ప్రాక్దిశకు పాకుతోంది. పశ్చిమంలోని సముద్రం సూర్యుణ్ణి మ్రింగటానికి ఆకలిగొన్న సర్పంలా వేయినాలుకలను పైకెగరవేస్తున్నది.

నా కాళ్ళకు చెప్పినబుద్ధి వాటిలో జీర్ణించుకుపోయింది: అలవాటుపడ్డ నా కాళ్ళ గుర్రం నడవటానికి మొండికేస్తున్నది. ఆలోచనలను అనంతంగా అరిగించుకోవటంవలన దుష్ఫలితాన్ని అనుభవిస్తున్న నా అజీర్ణపు మెదడు మందంగా నిలబడిపోయింది. ఆలోచనలన్నీ స్థంబించిపోతున్నాయి. నా ఆలోచనలతో పాటు పెరిగిన నా ఛాయ ప్రాక్దిశకు ప్రాకిపోయింది. తనతల్లి చీకటినుండి విడతీసిన దుష్టుడు సముద్రగర్భంలోపడి అంతర్ధానమవుతున్నాడు. తన మాతృమూర్తిలో లీనమైపోవటం కంటె నా ఛాయమాత్రం ఏంకోరుకుంటుంది? నాతో బయలుదేరిన శత్రువు, మిత్రువు కాలగర్భంలో కలిసిపోతుంటే నేనొక్కణ్ణి ఆలోచనారహితంగా అంటుకుపోయినా గర్భకుహరాన్ని సముదాయిస్తూ ఎంతకాలంలో గడపగలను? నా అస్థిత్వాన్ని అంతర్ధానంచేసి ఛాయగా మారి చీకటిలో కలిసిపోతే? అస్థిత్వాన్ని ఉద్దీపింపచేసి అరుణకిరణాలలో లీనమయిపోతే? అసంభవమైన సందర్భాలు సంభవమైపోతే? ఈ సృష్టికర్థం ఏముంటుంది? నావునికికి విలువ ఏముంటుంది?

నా ఆలోచనలు నా ఛాయతోపాటు పెరిగి దానితోపాటు అంతమయి పోయినాయి. ఉషస్సుతో బయలుదేరిన నా వుద్వేగం దినమంతా పయనించి భాస్కరునితోపాటు బయలు వెడలింది. ఈ రాత్రి మళ్ళీ పగలుగా మారుతుంది గదా? మాయమయిన మిత్రులు మళ్ళీ కలుస్తారు గదాకలిసినా విడిపోవటానికేగా. విడిపోతున్నా తిరిగి కలవటానికే! ఈరాత్రి తిరిగి పగలు కాకుండా వుంటే నాకు పట్టిన నిద్రకు తిరిగి మెలకువ రాకపోతే ఈ జగత్తంతా సుషుప్తిలో జోగాడుతూ వుంటుంది. నా వునికి అస్థిత్వంపోయి నామరహితమై పోతుంది? ఆ...!! వీల్లేదు. నా అస్థిత్వానికి భంగంరాకూడదు...ఈ జగత్తంతా నాకోసం సృష్టించబడిందే! అనుభవయోగ్యంకాని గాలిమేడలకు మెట్లు కట్టాలి. స్వర్గసౌధానికి నిచ్చెనలు వేసుకోవాలి. యివన్నీ నాకోసం నేనే వున్నాను...నేను ఉండాలి...అనుభవించాలి... ఆరుబయట అట్లాగే పడివున్న మంచంమీదకు పరుగెతుంటే నాలో వకవిధమైన భయం బయలుదేరింది. ఈ రాత్రికి పగలుకాదేమో! నా నిద్రకు మెలకువ రాదేమో! వీల్లేదు...తెల్లవారవలసిందే.

---

దారేపోతూన్న సింహానికి కప్ప బెకబెకలాడ్డం వినిపించింది. ఆ ధ్వనినిపట్టి అది చాలా పెద్దజంతువు అయివుంటుదని వూహించి, అక్కడే వేచివుంది సింహం. చివరకో కప్పపిల్ల గెంతుకుంటూ గుంటలోంచి బైటికి వచ్చింది. సింహం ఎగిరివెళ్ళి, దాన్ని తన పాదంతో నొక్కిపెట్టి అంది "వింతగావుందే! నువ్వు యింత చిన్నదానివి, ఎంత గొంతుందీ!"